క్లుప్తంగా

రామాయణం ఆదర్శం



సామూహిక కుంకుమార్చలో మహిళలు

పాణ్యం: రామాయణం మానవజాతికి ఆదర్శం అని టీటీడీ ధర్మ ప్రచారక్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకట్‌రెడ్డి అన్నారు. గోనవరం గ్రామంలో ఐదు రోజులుగా జరుగుతున్న ధార్మిక సంస్కృతి కార్యక్రమాల ముగింపులో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమర్చన, గోపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచి నైతిక విలువల గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో శివరామిరెడ్డి, పక్కిరారెడ్డి, వెంకటశేషయ్య, రామసుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, శేషిరెడ్డి హనుమంతు పాల్గొన్నారు.

నిలిచిన ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి శనివారం ఇన్ ఫ్లో నిలిచిపోయింది. డ్యాంలో 0.881 టీఎంసీల నీరు నిల్వ ఉండగా కేసీ కాల్వకు 817 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

రేపు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ఓర్వకల్లు: సోమయాజులపల్లె గ్రామం వద్ద ఉన్న శ్రీరామరామేశ్వర షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 10 వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కాగడ హారతి, మహాభి షేకం, అష్టోత్తరము, ధుని పూజలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 7 గంటలకు పల్లకీ సేవ చేపడుతామన్నారు. అలాగే ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భజన కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు.

రైతు భరోసాకు పేర్లు నమోదు చేసుకోండి

గూడూరు రూరల్: 2023 సంవత్సరానికి సంబంధించి రైతు భరోసాకు అర్హత కలిగిన రైతులు కొత్తగా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని శనివారం వ్యవసాయ అధికారి శ్రీవర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన రైతులు ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఒక ఫొటో, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను సమర్పించాలని సూచించారు. లబ్ధిదారుడు చనిపోయి ఉంటే నామినీలు పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి

గూడూరు రూరల్: ఉపాధి పనులు జరిగే ప్రదేశాల్లో తప్పనిసరిగా కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఏపీఓ హసీనా సూచించారు. కె.నాగలాపురంలో చేపట్టిన ఉపాధి పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండ వేడిమి ఎక్కువగా ఉన్నందున ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల ప్రదేశాల్లో కూలీలు సేద తీరేందుకు షామియానాలు, తాగునీరు, ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ప్రతి కూలీకి ప్రభుత్వం రోజుకు వేతనం రూ. 257 ఇచ్చేదని ప్రస్తుతం అదనంగా రూ. 15ను పెంచి ఇస్తుందన్నారు. ప్రతి కూలీకి పూర్తి స్థాయి వేతనం పడే విధంగా పని చేయించాలని ఆమె సిబ్బందికి సూచించారు.

అప్పర్ భద్రను నిలిపేయాలి

నందవరం: కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర నదిపై అప్పర్‌భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపేయాలని ఆర్‌వీఎస్ రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యుడు సీమ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాయలసీమ హక్కుల సాధనకు ఈ నెల 24న కర్నూలులో జరిగే ఒక్క రోజు నిరసన దీక్షకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి బదులు రోడ్డు కం బ్యారేజ్ నిర్మించాలని, అప్పర్ భద్ర ప్రాజెక్టును కర్ణాటక ప్రభుత్వం నిర్మించడంతో రాయలసీమకు తుంగభద్ర నది నుంచి రావాల్సిన నికర జలాలు హెచ్‌ఎల్‌సీ, ఎల్సెల్సీ, కేసీ కెనాల్ బైవారణి తిప్ప ప్రాజెక్టు రైతులకు రావన్నారు. వెంటనే ఆ ప్రాజెక్టు నిర్మాణం నిలిపేయాలన్నారు. శ్రీబాగ్ ఒప్పందాన్ని పూర్తిగా అమలు చేసి నీళ్లు, నిధులు, నియామకాలలో న్యాయం చేయాలని కోరుతూ నిర్వహించనున్న దీక్షల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. సమావేశంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు హరి నాయుడు, నాగభూషణం, గోపాల్, సురేంద్ర రెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



కర్నూలు(హాస్పిటల్): నగరంలోని బుధవార పేటలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. కేంద్రంలో పిల్లలకు, గర్భిణులకు ఇస్తున్న పౌష్టికాహారంతో పాటు జింక్, ఐరన్ మాత్రల పంపిణీ వివరాలను ఆయన పరిశీలించారు. రక్తహీనతకు సంబంధించి గర్భిణులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నిధులు నిరుపయోగం

- టీడీపీ హయాంలో నాసిరకంగా మూడు గోదాంల నిర్మాణం
- ఒక్కోదానికి రూ. కోటి ఖర్చు
- కొన్నాళ్లకే శిథిలం



కోడుమూరులో శిథిలావస్థలో ఉన్న ఉల్లి గోదాము

కోడుమూరు: ఉల్లి గోదాములు నిరుపయోగంగా మారాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకుల జేబులు నింపేందుకు అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ నిధులతో కోడుమూరు, గూడూరు, కర్నూలు మండలాల్లో ఒక్కొక్క గోదాం కోటి రూపాయల వ్యయంతో నిర్మించారు. అయితే, ఇవి ఏర్పాటు చేసిన ప్రాంతం రైతులకు అనుకూలంగా లేకపోవడంతో వారు ఉల్లిపంటలను నిల్వ చేసుకోవడంలేదు. అప్పట్లో కాంట్రాక్టర్లు, తెలుగుదేశం పార్టీ నేతలు కమీషన్లు దండుకొని హడావుడిగా పనులు పూర్తిచేశారు కానీ రైతులకు వాటి వల్ల ఎలాంటి ఉపయోగం జరగలేదు. ఇప్పటి వరకు ఒక్క రైతు కూడా గోదాంలో ఉల్లి పంటను నిల్వ చేసుకోలేదు. గోదాముల నిర్మాణ వ్యయం అంచనాలను అధికంగా వేసుకొని నిధులను కాజేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోడుమూరు, గూడూరు మార్కెట్‌యార్డు కేంద్రాల్లో నిర్మించిన ఉల్లి గోదాములు పూర్తిగా శిథిలమైపోయాయి. ఉల్లి పంటను గ్రేడింగ్ చేసుకునేందుకు నిర్మించిన డ్రైయింగ్‌యార్డులు సైతం పూర్తిగా పాడైపోయాయి. కోడుమూరు పట్టణ శివారులోని వెల్దుర్తి రోడ్డులో ఉన్న 20 ఎకరాల మార్కెట్‌యార్డు స్థలంలో నిర్మించిన రెండు షెడ్ల ఆవరణలో ప్రస్తుతం పిచ్చిమొక్కలు మొలిశాయి. ఉల్లి గోదాముల నిర్మాణాలకు ఉపయోగించే పైపులు స్క్రాబ్ నుంచి తీసుకొచ్చి బిగించారు. తుప్పుపట్టిన పాత పైపులతో షెడ్లు, రంగులు వేసి కాంట్రాక్టర్ బిల్లులు చేసుకున్నాడు. షెడ్ల కింద వేసిన కాంక్రీట్ పనులన్నీ శిథిలమైపోయాయి. నాసిరకంగా పనులు చేయడంతో కోడుమూరు, గూడూరు మార్కెట్‌యార్డు ఆవరణల్లో నిర్మించిన షెడ్లు కూలిపోయే పరిస్థితి ఉంది. గూడూరు గోదాం పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. అప్పట్లో నీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఉల్లిపంటను నిల్వ ఉంచుకునేందుకు ముందుకు రాలేదు. 2015లో ఈ గోదాంలను నిర్మించారు. నిర్వహణ లోపంతో కొన్నాళ్లకే అవి శిథిలవస్థకు చేరుకున్నాయి.

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతాం

కర్నూలు నుంచి కోడుమూరు మార్కెట్‌యార్డు ఈ మధ్య కాలంలోనే విభజన జరిగింది. మార్కెట్ యార్డులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోంది. ఏడేళ్ల క్రితం నిర్మించిన ఉల్లి గోదాములు శిథిలమైపోయాయి. మరమ్మతుల కోసం ఉన్నతాధికారుల అనుమతితో నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపుతున్నాం.

– సుంకారెడ్డి, మార్కెట్‌యార్డు సెక్రటరీ

పూలే జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

- జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారి ఏ నాగేశ్వరరావు

కర్నూలు(అర్బన్): ఈ నెల 11వ తేదిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారి ఏ నాగేశ్వరరావు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసే ప్రక్రియలో భాగంగా శనివారం తమ శాఖకు చెందిన అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు అమరావతి నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారన్నారు. కార్యక్రమానికి సంబంధించి పలు విషయాలను తెలుసుకున్న ఆయన ప్రోటోకాల్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని, కార్యక్రమంలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు జరగరాదని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యక్రమ నిర్వహణపై జిల్లా బీసీ సంఘాల నేతలతో డీఆర్‌ఓ సమక్షంలో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలను స్వీకరించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే వేదిక ఏర్పాటు గురించి నగర పాలక సంస్థ అధికారులతో కూడా చర్చించామన్నారు. సహాయ సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులు, కార్యాలయ ఉద్యోగులకు బాధ్యతలు కూడా అప్పగించామన్నారు. ఎక్కడా ఎలాంటి లోపం జరగకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు.

రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

కర్నూలు(న్యూటౌన్) : ఎదురూరు గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున రౌడీషీటర్లు కమాల్ బాషా, ఉస్మాన్‌బాషా పొట్టేళ్ల చోరీకి యత్నించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంజనేయ, వీరభద్ర, రామేశ్వరస్వామి ఆలయాల చైర్మన్ బోయ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గతంలో కూడా ఆ ఇద్దరు దొంగతనాలకు పాల్పడ్డారని చెప్పారు. శనివారం సాయంత్రం సీతారాముల, శివాలయం వద్ద గ్రామ ప్రజలతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు.

హోరాహోరీగా గ్రామీణ క్రీడా పోటీలు



విజేత వృషభాల యజమానికి నగదు బహుమతి అందిస్తున్న దాత ఉప్పరి కిరాణం వెంకటరమణ

వెల్దుర్తి: రామళ్లకోటలో వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం కాడెద్దుల గిరక బండి లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి రామళ్లకోట మాధవస్వామి ప్రారంభించారు. 23 కాడెద్దులు పాల్గొన్న ఈ పోటీలలో కల్లూరు మండలం నాయకల్లు పంచాయతీ ఉపసర్పంచ్ షంషీర్ కాడెద్దులు విజేతగా నిలిచి రూ.20వేలు సొంతం చేసుకున్నాయి. తర్వాతి మూడు స్థానాల్లో దేవనకొండ మండలం కోటకొండ బలరాముడు వృషభాలు, వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె మనోజ్ వృషభాలు, కోడుమూరు మండలం లద్దగిరి జీఎస్ఆర్ బుక్స్ రవి వృషభాలు నిలిచాయి. వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు గెలుచుకున్నాయి. తాడు లాగు పందెంలో గ్రామానికే చెందిన చింతకాయల రాజు సత్తా చాటి రూ.3 వేల నగదు బహుమతి పొందాడు. బైక్ స్లో రేసులో చనుగొండ్ల మహేంద్ర విన్నర్‌గా నిలిచి రూ.2 వేలు, రన్నర్‌గా అదే గ్రామానికి చెందిన సురేంద్ర రూ.వెయ్యి గెలుచుకున్నారు. విజేతలకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చింతకాయల వెంకటేశ్వర్లు, దాతలు, నిర్వాహకులు బహుమతులందించారు.

కోలుకోలేక వృద్ధుడి మృతి

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలో గూడ్స్ రైలు తగిలి తీవ్రంగా గాయపడిన వృద్ధుడు కోలుకోలేక శనివారం మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు. భూపనపాడు గ్రామానికి చెందిన పశావులు చిన్న రామన్న (83) రెండు రోజుల క్రితం పాణ్యం వద్ద ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు పైలెట్ గమనించి ఆపాడు. ఈ ఘటనలో గాయపడిన రామన్నను 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందాడు. అయితే, మృతుడికి మతిస్థిమితం సరిగ్గా లేదని, వీపరితమైన చెవుడు ఉన్నట్లు తెలిసిందన్నారు. ఈమేరకు కుమారుడు పశావుల రామక్రిష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుడికి భార్య సరస్వతి, నలుగురు సంతానం.

విద్యాభివృద్ధికి విప్లవాత్మక మార్పులు



కేజీబీవీలో భోజన నాణ్యతను పరిశీలిస్తున్న ప్రవీణ్‌ప్రకాష్

తుగ్గలి: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. శనివారం ఆయన తుగ్గలి జెడ్పీ ఉన్నత పాఠశాల, నోవీ స్కూల్‌లో నిర్వహిస్తున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పర్యవేక్షించాలని చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులను ఆదేశించారు. అనంతరం కేజీబీవీని సందర్శించి తరగతి గదులు, భోజన నాణ్యతను పరిశీలించారు. కస్తూర్బాల్లో పేద విద్యార్థినులే అధికంగా ఉంటారని, వారిని సొంత పిల్లల్లా చూసుకోవాలని సూచించారు. విద్యార్థినులకు రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. అర్థమయ్యేలా పాఠాలు బోధించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆయన మాట్లాడి వారిచేత పాఠాలను చదివించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని, బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్జేడీ ప్రతాపరెడ్డి, డీఈఓ రంగారెడ్డి, ఎస్ఎస్ఏ ఏపీఓ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంఈఓ రామవెంకటేశ్వర్లు ఉన్నారు.

● మద్దికెర: పోషక విలువలు కలిగిన రాగిజావాను వారానికి మూడుసార్లు విద్యార్థులకు తప్పనిసరిగా ఇవ్వాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని బురుజుల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. చిన్నారులతో పాటు రాగిజావ రుచి చూసి మెనూ ప్రకారం ఇస్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఈఓ రంగారెడ్డి, ఎంఈఓ రంగస్వామి ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

కల్లూరు : వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. శనివారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను, కల్లూరు అర్బన్ వీకర్ సెక్షన్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ఇస్తున్న ఐరన్ మాత్రలు, సిరప్‌లు ఉన్నాయా లేవా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

బీజేపీ సామాజిక వారోత్సవాలు

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 14వ తేదీ వరకు సామాజిక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ పేర్కొన్నారు. అందులో భాగంగా కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఆనటి జనసంఘ్ పార్టీ (నేటి బీజేపీ)లో పనిచేసిన జేష్ఠ కార్యకర్తలుగా ఉన్న నంద్యాల గోపాల కృష్ణయ్య, గుజరాతి నాగప్పలను వారి వారి స్వగృహాల్లో ఘనంగా సన్మానించారు. కర్నూలు అసెంబ్లీ కన్వీనర్ రంగస్వామి, జిల్లా విస్తారక్ గోపాలకృష్ణ స్వామి, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం

- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్





పంచలింగాలలో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను ఇంటికి అతికిస్తున్న, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్, వృద్ధుడికి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే

కర్నూలు (న్యూటౌన్): అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగడం కోసం వైఎస్ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైఎస్ ఎంపీపీ 2 నెహమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, మండల మాజీ ఉపాధ్యక్షుడు వాసు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్‌తో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులతో చర్చించారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వ పాలనకు నేటి వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య తేడాను వివరించారు. అధికారంలోకి రాగానే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఈ నాలుగేళ్లలో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందన్నారు. విద్య, వైద్య రంగాన్ని బలోపేతం చేశారన్నారు. పేదలకు ఉచితంగా విద్య, వైద్యం అందిస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలబడాలని కోరారు. తర్వాత ఇళ్లకు క్యాలెండర్, డోర్ స్టిక్కర్లు, మొబైల్ ఫోన్ స్టిక్కర్లు అంటించి, 8296082960 నంబర్‌కు మిస్‌డ్‌కాల్ ఇప్పించారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థ ద్వారా తీసుకొచ్చారన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సేవను గ్రామాల్లోనే అందిస్తున్నారన్నారు. అలాగే కుల మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యులు రవిశాస్త్రి, కర్నూలు మండల ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైఎస్ ఎంపీపీ 2 నెహమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, ఎంపీటీసీ రామ్‌నాథ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

38, 39, 40 వార్డుల నాయకులతో సమావేశం

స్టాంటన్‌పురంలోని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ కార్యాలయంలో 38, 39, 40 వార్డుల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ప్రజామద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలను లబ్ధిదారులకు చదివి వినిపించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజల అభిప్రాయాలను స్వీకరించి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించాలని సూచించారు. 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు గిప్సన్, సచివాలయ కన్వీనర్లు ఖాజాబీ, సుంకన్న, మహేష్ గౌడ్, పక్కిరన్న, భాస్కర్, ఏసన్న, సుందర్‌రాజు, సీమోను, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలన గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ పరిధిలోని వివిధ వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్తు– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా వార్డుల్లో కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పలకరించారు. ప్రభుత్వం నుంచి వారికి చేకూరిన లబ్ధిని వివరించి, ఇంటి యజమాని అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టికర్లు అంటించారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామన్నారు. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చారని చెప్పారు. ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. అలాగే గత టీడీపీ పాలనకు, ప్రస్తుతం సీఎం జగనన్న పాలనకు గల తేడాను ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహులు, నాయకులు హనుమంతురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రంగప్ప, జగదీష్‌రెడ్డి, పుల్లారెడ్డి, ఆయా వార్డుల్లోని స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ మహ్మద్ షరీఫ్ ఆధ్వర్యంలో ' జగనన్నే మా భవిష్యత్తు'' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ పంపిన ఐదు ప్రశ్నలను సంధించి ఇంటి యజమానులతో సమాధానం రాబట్టారు.

వైఎస్సార్‌సీపీకి అండగా నిలబడండి

ఓర్వకల్లు: సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలబడాలని గ్రామ సర్పంచు పుల్లా లలితమ్మ ప్రజలను కోరారు. శనివారం మండలంలోని పూడిచెర్ల గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటి యజమానులతో మాట్లాడి మా నమ్మక నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి, సచివాలయ కన్వీనర్ సోమశేఖరనాయుడు, వైస్ ప్రెసిడెంట్ గడెకారి పుల్లారెడ్డి, గామ నాయకులు మహేశ్వరరెడ్డి, ఆదాంబాషా, కొత్తపల్లె గోవిందరెడ్డి, కాసీం సాహెబ్, మధుసూదన్‌రెడ్డి, విజయేశ్వరరెడ్డి, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

దీక్షాదారులకు 'సహెరీ'

'అస్సలాము అలైకుమ్ భాయ్.
క్యాభాయ్ ఆప్ రోజా రఖే హో?.
వాలైకుమ్ అస్సలామ్. హా మైతో రోజా హు. క్యా ఆప్ భీ రోజా హో?. నహీ భాయ్. సహెరీకా ఇన్‌తెజామ్ ముష్కిల్ లగా. ఘర్‌వాలే గావ్ చలేహై. ఇస్ లియే నహి. బడే భాయ్.. సహెరీకా ఇన్‌తెజామ్‌తో హమారె ఇస్ షహర్‌మే హోతేహై. ఫలా మస్‌జీదోమే ముఫ్త్‌మే హోతాహై. అచ్చ బహుత్ ఖుషీకి బాత్‌హై. కల్‌సే వహీపర్ సహెరీ ఖాకే రోజా రఖుంగా'.



సహెరీ చేస్తున్న ముస్లింలు

- రోజా ఉంటున్న వాళ్ల కోసం నగరంలో ఏర్పాట్లు
- ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహణ

కర్నూలు(రాజ్‌విహార్): ఉపవాస దీక్ష ఉండే ముస్లిం సోదరుల సేవలో పలు మసీదులు, స్వచ్ఛంద సంస్థలు తరిస్తున్నాయి. పవిత్రరంజాన్ మాసంలో రోజా ఉండడం ఎంతో పుణ్యమో.. వారి దీక్షలకు తగిన సహకారం అందించడం అంతకు మించి పుణ్యం లభిస్తుందని పవిత్ర ఖురాన్ బోధిస్తోంది. రోజా ఉండే వాళ్లు అర్ధరాత్రి 3 గంటలకు నిదుర లేచి సహెరీ కోసం ఆహారాన్ని వండుకోవాలి. ఇది కుటుంబసభ్యులకు సాధ్యమయినా.. ఇంట్లో మహిళలు లేని పురుషులకు, విద్యార్థులు, ఒంటరిగా ఉన్న వాళ్లకు ఇబ్బందికరమే. అలాంటి వాళ్ల కోసం కొన్ని మసీదులు, కొన్ని హోటళ్లు, స్వచ్ఛంద సంస్థలు సహెరీ ఏర్పాటు చేసి ఉపవాస దీక్షలు ఉండే వాళ్లకు భోజనాలు పెడుతున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా ముస్లింలు ఉన్న నగరం కర్నూలు. ఉమ్మడి జిల్లాజనాభాలో దాదాపు 20శాతానికి పైగా ఉన్నారు.

వంటలు ఇలా...

రంజాన్ సందర్భంగా నగరంలో సహెరీ సందడి ఉంటోంది. తెల్లవారు జామున 3:30 నుంచి 4:50గంటల మధ్య ఉపవాస దీక్షలు పాటించే ముస్లిం సోదరులకు కిచిడీ, కీమా, రోటీ, చపాతి, పరోట, దాల్, అన్నం తదితర వంటకాలు చేసి వడ్డిస్తున్నారు. గతంలో ఇఫ్తార్ విందులే ఇచ్చేవారు. కాని పదేళ్ల క్రితం నుంచి సహెరీ చేయిస్తున్నారు. సహెరీ చేయిస్తే అధిక పుణ్యం లభిస్తుందని నిర్వహకులు చెబుతున్నారు.

సహెరీ ఏర్పాట్లు ఎక్కడంటే...

- నగరంలోని ఖూబ్‌సూరత్ మసీద్, లాల్ మసీదు వద్ద, కర్నూలు.
- నూరానీ మసీద్, పెద్దమార్కెట్.
- డాక్టర్ మియా హత్తి (ఏనుగు) బీడీ ఫ్యాక్టరీలో, ఖడక్‌పుర.
- హజరత్ మౌలా మిష్కిన్ మసీద్, కొత్తపేట.
- ఖాదుమియా మసీద్, కొత్తపేట.
- మామూర్ మసీద్, సి.క్యాంప్ సెంటర్.
- అబ్బాస్ మసీద్, యూనిక్ స్కూల్ వద్ద, అబ్బాస్ నగర్.
- గౌసల్ ఆజం మసీదు, (కేవలం విద్యార్థుల కోసం), బీ.క్యాంప్, కర్నూలు.

సహెరీ సేవలు అభినందనీయం



రంజాన్‌లో రోజా పాటించాలంటే సహెరీ తప్పనిసరి. విద్యార్థులు, ప్రయాణికులకు, ఉద్యోగులు, ఇళ్లలో స్త్రీలు లేని వాళ్లకు సహెరీ ఏర్పాట్లు చేసుకో వడం ఇబ్బందికరం. అయితే అలాంటి వారి కోసం ప్రతి రోజూ వంటలు చేసి పెట్టడం అభినందనీయం.

– షేక్ మహమ్మద్ రసూల్, హిందీ టీచర్

మహాపుణ్య కార్యం



ఉపవాస దీక్షలు పాటించే వారి కోసం సహెరీ ఏర్పాట్లు చేయడం మహాపుణ్యకార్యం. ప్రతి రోజూ అర్ధరాత్రి నిదుర మేలుకొని వంటలు వండి పెట్టడం అంటే సామాన్యమైన విషయం కాదు. రోజాలకు ముందు కడుపు నింపడం అభినందించదగ్గ విషయం.

– ఎస్. ఇలియాస్ అహ్మద్, కర్నూలు

పేదల పక్షపాతి సీఎం

గూడూరు: సీఎం జగన్‌మోహన రెడ్డి పేదల పక్షపాతి అని మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పట్టణంలోని 1వ సచివాలయం పరిధిలో 'జగనన్నే మా భవిష్యత్తు– మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, సచివాలయ కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లు తదితరులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జగనన్న ద్వారానే సంక్షేమం అందుతుందని పేర్కొన్నారు. పథకాలు మీకు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి అనుమతి తీసుకుని ఇంటికి స్టిక్కర్ అతికించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నంద కిషోర్, దస్తగిరి, మద్ది,కిషోర్, నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కర్నూలు కల్చరల్: ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కల్లూరు ఆదిత్య విద్యా నిలయంలో సిద్ధ ఆయుర్వేద యోగ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. భాగ్యనగరానికి చెందిన ఆర్థో, న్యూరో, ఆక్యుప్రెజర్ నిపుణులచే ఉచిత చికిత్స ద్వారా సమస్యలకు పరిష్కారం చూపుతారు. వివరాలకు 89198 01926, 98859 71077 నంబర్లలో సంప్రదించాలని నిర్వహకులు సూచించారు.